# సామాజికరంగ అభివృద్ధి.. మహిళల సాధికారత

**సామాజిక రంగంలో ముఖ్య అంశాలుగా పేదరిక నిర్మూలన, వృత్తులవారీ విభజన, విద్య, ఆరోగ్యం, సామాజికంగా వెనుకబడిన వర్గాల్లో ఉపాధి, కుటుంబ సంక్షేమం వంటి వాటిని పేర్కొనవచ్చు. భౌగోళిక వైశాల్యం, జనాభా పరంగా దేశంలో ఐదో పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. జనాభా పెరుగుదల ధోరణి, వాటి ఫలితాలను తెలుసుకోవడానికి జనాభా పరిమాణం, పునరుత్పత్తి రేటు, స్త్రీ, పురుష నిష్పత్తి, వయో విభజన, జనసాంద్రత, గ్రామీణ పట్టణ జనాభా మొదలైన అంశాలను పరిశీలించాలి. 2001 జనాభా లెక్కల ప్రకారం ప్రాథమిక రంగంపై 64.6 శాతం, ద్వితీయ రంగంపై 13 శాతం, తృతీయ రంగంపై 22.4 శాతం మంది శ్రామిక శక్తి ఆధారపడి ఉంది. సామాజిక రంగంపై పెట్టుబడులు దీర్ఘ కాలంలో ఆర్థిక ప్రగతికి దారితీస్తాయి. రాష్ట్ర అవతరణ తర్వాత ఆర్థిక, సాంఘిక సూచీలకు సంబంధించి ప్రగతి కనిపించినప్పటికీ.. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు లభించలేదు. సామాజిక వెనుకబాటుతనం వల్ల వృత్తుల వారీ పంపిణీలో మార్పు కనిపించలేదు. ఇప్పటికీ అధిక శాతం శ్రామిక శక్తికి ఆధారం ప్రాథమిక రంగం. దీంతో ప్రచ్ఛన్న నిరుద్యోగం కనిపిస్తోంది. స్త్రీ,పురుషులు, వివిధ సామాజిక అంశాల మధ్య అసమానతలు రూపుమాపడానికి స్త్రీలలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ సాధికారత పెంపుదలకు ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న చర్యలు ఆర్థిక-సాంఘిక రంగాల పురోగతికి దోహదం చేశాయి. ఈ నేపథ్యంలో సిలబస్‌ను రూపొందించారు.**

### పేపర్- III

#### విభాగం-2 యూనిట్-3 సిలబస్

- జనాభాపరమైన లక్షణాలు, సామాజిక వెనుకబాటుతనం, నిరక్షరాస్యత, వృత్తి స్వరూపం, ఆదాయానికి ఉపాధికి



సంబంధించిన రంగాలవారీ పంపిణీలో మార్పులు, మహిళల సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారత.

- **ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక వెనుకబాటుతనం రాష్ట్ర ఆర్థికాభి వృద్ధిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుంది?**

జ: సామాజిక వెనుకబాటుతనం ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. రాష్ట్ర అవతరణ తర్వాత సామాజిక రంగం అభివృద్ధికి పలు చర్యలు చేపట్టినప్పటికీ సామాజిక వెనుకబాటుతనం ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్థిక, సామాజిక రంగాల్లో ఒకేసారి అభివృద్ధిని సాధించినప్పుడే మానవాభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా వనరుల సమర్థ వినియోగానికి వీలవుతుంది. రాష్ట్రంలో విద్య, ఆరోగ్య ప్రమాణాల విషయంలో స్త్రీ, పురుషుల మధ్యే కాకుండా వివిధ సామాజిక వర్గాల మధ్య కూడా వ్యత్యాసాలు పెరిగాయి. రాష్ట్ర అవతరణ తర్వాత పారిశ్రామిక రంగంపై ఆధార పడిన శ్రామికశక్తిలో ఎటువంటి మార్పు లేదు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం పొందలేని వ్యక్తుల ఆదాయాలు తగ్గి వారి జీవన ప్రమాణం కుంటుపడుతుంది. సామాజిక వెనుకబాటుతనం పేదరికం, నిరుద్యోగం పెరగడానికి దారితీసి బాలకార్మిక వ్యవస్థ ఏర్పడటానికి కారణమైంది. ముఖ్యంగా స్త్రీలలో అక్షరాస్యత తక్కువగా ఉండటం, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు కాక పోవడంతో సంతానోత్పత్తి రేటు పెరుగుతుంది. తద్వారా జనాభా విస్ఫోటనం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. షెడ్యూల్డ్ కులాల ప్రజల్లో ఇప్పటికీ 42 శాతం మందికి రక్షిత మంచినీటి సౌకర్యం లేదు. విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రైవేటీకరణ ఎక్కువగా ఉండడం కూడా సామాజిక వెనుక బాటుతనం పెరగడానికి దోహదం చేసింది. వృత్తుల వారీ శ్రామికశక్తి పంపిణీలో ఎటువంటి మార్పు లేకపోవడం స్థూల ఉత్పత్తి తగ్గుదలకు దారితీసి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది.

☞ ఈ క్రమంలో సామాజిక అంశాలు ఆర్థికాభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించాలి. సామాజిక అంశాల్లో వివిధ వర్గాలు, ప్రాంతాల మధ్య వ్యత్యాసాలకు గల కారణాలు పేర్కొని తద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఆర్థికపరమైన వ్యత్యాసాలకు ఇవి

ఏ విధంగా దోహదం చేశాయో విశ్లేషించాలి.

- **ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక-సాంఘిక రంగ అభివృద్ధిని వివరించండి?**

**జ:** రాష్ట్ర అవతరణ తర్వాత మూడు ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పిస్తూ ఆర్థికాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. విద్య, ఆరోగ్యం, పేదరిక నిర్మూలనలో ప్రగతి కనిపించింది. 2001 గణాంకాల ప్రకారం దేశ జనాభావృద్ధితో పోల్చినపుడు రాష్ట్ర జనభావృద్ధి రేటు తక్కువ. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విషయంలో మానవాభివృద్ధి తక్కువ. అక్షరాస్యత రేటు 1951లో 13 శాతం ఉండగా 2001లో అది 61 శాతానికి పెరిగింది. ప్రజారోగ్యానికి సంబంధించిన సూచీల విషయంలో రాష్ట్రస్థితి కొంత మెరుగని చెప్పొచ్చు. ముఖ్యంగా సహజ జననాల రేటు, ప్రతి 1000 మంది జనాభాకు సహజ మరణాల రేటు, శిశు మరణాల రేటు, ప్రతి స్త్రీకి సంబంధించిన ఫలదీకరణ రేటు విషయంలో జాతీయ సగటుకన్నా రాష్ట్ర సగటు తక్కువగా ఉంది. మరోవైపు రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి రేటు పెరిగింది. ముఖ్యంగా 2004 తర్వాత జీఎస్‌డీపీలో పెరుగుదల కనిపించడానికి వ్యవసాయ రంగం అందించిన తోడ్పాటు కూడా ప్రధానం కారణమని చెప్పొచ్చు.

☞ ఈ క్రమంలో ఆర్థిక-సాంఘిక రంగ అభివృద్ధి వేగవంతమవటానికి వివిధ సామాజిక అంశాలపై పెట్టుబడుల ఆవశ్యక తను వివరించాలి. సామాజిక సేవలపై పెట్టే పెట్టుబడులు దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి దోహదం చేసే తీరును వివరించాలి.

- **వృత్తుల వారీ పంపిణీ, ఆదాయం,ఉపాధికి సంబంధించి రంగాల వారీ పంపిణీలో చోటు చేసుకున్న మార్పులకు ఉన్న సంబంధం?**

**జ:** వృత్తులవారీ వ్యవస్థ, ఆర్థికాభివృద్ధికి మధ్య దగ్గర సంబంధం ఉంది. రాష్ట్ర అవతరణ తర్వాత 1960-61లో ప్రాథమి క రంగంపై 71.71 శాతం, ద్వితీయ రంగంపై 13.46 శాతం, తృతీయ రంగంపై 14.83 శాతం శ్రామిక శక్తి ఆధారపడి ఉంది. 2001లో ఈ రంగాలపై ఆధారపడిన వారి సంఖ్య వరుసగా 64.6 శాతం, 13 శాతం, 22.4 శాతం. దీన్ని బట్టి రాష్ట్రంలో వృత్తి వారీ విభజనలో పెద్ద మార్పు లేదని భావించవచ్చు. రాష్ట్ర అవతరణ తర్వాత జీఎస్‌డీపీ లో వివిధ రంగాల వాటాలో మాత్రం మార్పులు చోటు చేసుకున్నాయి. జీఎస్‌డీపీలో దాదాపు సగభాగం వాటా కలిగిన సేవా రంగంపై ఆధారపడిన శ్రామిక శక్తిలో మాత్రమే స్వల్ప మార్పు సంభవించింది. వృత్తుల వారీ వ్యవస్థలో శ్రామిక భాగస్వామ్యం రేటు ప్రాథమిక రంగం నుంచి ద్వితీయ, తృతీయ రంగాలకు మారుతున్నప్పుడే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది.

☞ ఈ క్రమంలో గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష శ్రామిక శక్తిని కొంత వరకు గణాంకాలలో వివరిస్తూ ఆదాయం, ఉపాధి పెరుగుదలకు శ్రామిక శక్తి బదలాయింపు ఆవశ్యకతను పేర్కొనాలి. వ్యవసాయంలో సంప్రదాయక విధానాలకు బదులు సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగిస్తున్నప్పుడే ఆ రంగంలోని అదనపు శ్రామికులు మిగతా రంగాలకు బదిలీ అవుతారు. గ్రామీణ ప్రాంతాల్లో మిగతా రంగాలపై ఆధారపడినవారి కంటే వ్యవసాయంపై ఆధారపడిన ప్రజల తల సరి వినియోగ వ్యయం తక్కువ.

- **ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల వారీగా జనాభా సంయోజనం వివరించండి?**

**జ:** ఆంధ్రప్రదేశ్‌లో గత రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలించినపుడు.. 1981-91లో జనాభా పెరుగుదల రేటు ఎక్కువ. 1991-2001లో రాష్ట్రంలో జనాభా పెరుగుదల రేటు జాతీయ సగటు కంటే తక్కువ. రాష్ట్ర అవతరణ తర్వాత జరిగిన సాంఘిక, ఆర్థికాభివృద్ధి కూడా జనాభా విషయంలో పెద్దగా మార్పులు తీసుకురాలేకపోయింది. మొత్తం జనాభాలో పురుషుల సంఖ్యలో కంటే స్త్రీల సంఖ్యలో పెరుగుదల తక్కువ. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువ. రాష్ట్రం మొత్తం జనాభాలో పట్టణ జనాభా 1951-61 మినహా మిగతా కాలంలో పెరిగింది. పెరుగుతున్న పట్టణీకరణను ఆర్థికాభివృద్ధికి సూచికగా భావిస్తారు. జనాభా అత్యధిక వార్షిక పెరుగుదల రేటు తెలంగాణాలో ఎక్కువ. ఆంధ్ర ప్రాంతంలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉండటానికి ఆయా ప్రాంతాల నుంచి వలసలే కారణం. స్త్రీ, పురుషుల అక్షరాస్యత విషయంలో కోస్తా ఆంధ్ర ప్రాంతం ముందుంది. తెలంగాణాలో సంతాన ఉత్పత్తి రేటు ఎక్కువ ఉండటానికి విద్య, ఆరోగ్య ప్రమాణాలు తక్కువగా ఉండటమే కారణం.

☞ ఈ క్రమంలో జనాభా వృద్ధి రేటు, జనసాంద్రత, గ్రామీణ పట్టణ జనాభా, పునరుత్పత్తి రేటు, స్త్రీ,పురుష నిష్పత్తి విషయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్యగల తేడాలను వివరిస్తూ దానికి గల కారణాలను విశ్లేషించాలి.

- **మహిళా సాధికారత ఆవశ్యకత, రాష్ట్రంలో మహిళా సాధికార తకు తీసుకున్న చర్యలు?**

**జ:** మహిళల్లో సాధికారత పెంపు సామాజిక ఆర్థిక వృద్ధికి దారి తీస్తుంది. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించడం, ఎన్నికలు, సామాజిక సాధికారత ఉపాధిలో ప్రత్యేక రిజర్వేషన్లను కల్పించడం ద్వారా సాధికరతను సాధించవచ్చు.

☞ ఈ క్రమంలో మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి తద్వారా జరిగిన వృద్ధిని వివరించాలి. అంతేకాకుండా మహిళాభివృద్ధికి భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల ను సూచించాలి.

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర అవతరణ తర్వాత సామాజిక రంగం అభివృద్ధికి చేపట్టిన

చర్యలపై అవగాహన తప్పనిసరి

- వివిధ సామాజిక అంశాలపై పెట్టుబడుల ఆవశ్యకత తద్వారా లభించే ఫలితాలపై విశ్లేషణాత్మక అధ్యయనం చేయాలి
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్త్రీ, పురుష శ్రామిక శక్తి గురించి గణాంకాల ఆధారంగా విశ్లేషించడం కచ్చితంగా మేలు చేస్తుంది.
- మహిళా సాధికారతకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, మరింత ప్రభావవంతమైన చర్యల గురించి తెలుసుకోవడం మంచిది.